సంపుటి :04 | సంచిక :91 | పేజీలు :06 | www.aksharadarbar.com

అక్షర దర్బార్
Voice of the People

ఆదివారం 10, మే 2026

వెల ₹5

## వేగవంతం చేయాలి

- ధాన్యం కొనుగోలుపై కలెక్టర్లతో వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- ఫార్మర్ రిజిస్ట్రీ వందశాతం పూర్తి కావాలని ఆదేశాలు

04

# బీజేపీలో నూతనోత్తేజం





- ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి బాధ్యతలు చేపట్టాక తొలిసారి నేడు తెలంగాణకు

భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం తెలంగాణలో పర్యటిస్తుండటంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. కేంద్రంలో వరుసగా మూడవసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోడీ రాష్ట్రానికి తొలిసారి వస్తుండటం, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభను నిర్వహించనుండటంతో బీజేపీ నేతలు దీనిని ఒక కీలక రాజకీయ మలుపుగా భావిస్తున్నారు. త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు మోడీ పర్యటనను ఒక 'లాంచ్ ప్యాడ్'గా వాడుకోవాలని బీజేపీ కేంద్ర నాయకత్వం రాష్ట్ర విభాగానికి దిశానిర్దేశం చేసింది. ముఖ్యంగా హైదరాబాద్ లోని మూడు కార్పొరేషన్ల పరిధిలోని డివిజన్లపై దృష్టి సారించి, భారీ ఎత్తున మహిళలు, యువతను సమీకరించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. జీడబ్ల్యూఎంసీలో ప్రస్తుతం ఉన్న 66 డివిజన్లు పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ఇక్కడ కూడా సత్తా చాటే దిశగా అడుగులు వేస్తున్నారు.

– అక్షరదర్బార్, హైదరాబాద్

03

- పశ్చిమబెంగాల్ విజయంతో నెక్స్ట్ టార్గెట్ తెలంగాణే అంటున్న కమలదళం
- ప్రధాని పర్యటనే లక్ష్యంగా.. ఎన్నికల శంఖారావం పూరించేందుకు రెడీ
- రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు మోడీ పర్యటనే 'బూస్టర్ డోస్'
- పరేడ్ గ్రౌండ్స్ సాక్షిగా బలప్రదర్శన.. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలే అస్త్రాలుగా వ్యూహం
- వరంగల్ కేఎంటీపీపీలో పీఎం మిత్రను ప్రారంభించనున్న మోడీ



## కేఎంటీపీని సందర్శించిన కేంద్ర కార్యదర్శి

- అభివృద్ధి పనుల పురోగతి పరిశీలన
- నేడు పీఎం మిత్రను ప్రారంభించనున్న ప్రధాని

03

## స్వీయ జనగణన తప్పనిసరి

- నేడు రాత్రి 12 గంటల వరకే గడువు
- ప్రతి కుటుంబం వివరాలు నమోదు చేయాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



02




## బైకును ఢీకొట్టిన మృత్యు లారీ

- అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన దంపతులు కేశవపూర్ గ్రామంలో విషాదం

02

## కర్లపల్లిలో ఘోర విషాదం

- లేగదూడను రక్షించబోయి తండ్రీకొడుకు మృతి

04



# స్వీయ జనగణన తప్పనిసరి

- నేడు రాత్రి 12 గంటల వరకే గడువు
- ప్రతి కుటుంబం వివరాలు నమోదు చేయాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



అక్షరదర్బార్, హనుమకొండ: 2027 జనగణనలో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ స్వీయ జనగణనకు ఈ నెల 10వ తేదీ రాత్రి 12 గంటల వరకు మాత్రమే అవకాశం ఉన్నందున, హన్మకొండ జిల్లా ప్రజలందరూ తప్పనిసరిగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. ప్రజలు ఇంటి వద్ద నుంచే సులభంగా https://se.census.gov.in వెబ్‌సైట్ ద్వారా స్వీయ గణన పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియను సులభంగా పూర్తి చేయవచ్చని, తమకు నచ్చిన భాషను ఎంపిక చేసుకుని కుటుంబ వివరాలను నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన ఈ స్వీయ జనగణన కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగియనున్నందున, ఇంకా నమోదు చేయని వారు వెంటనే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. జనగణన ప్రక్రియలో భాగంగా ముందుగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి స్థాయి జనగణన చేపడతారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి హౌస్ లిస్టింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారని తెలిపారు. దేశ ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పన, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలు, వనరుల సమర్థవంతమైన పంపిణీకి జనగణన అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు కూడా తమ ప్రస్తుత నివాసం నుంచే వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జనగణన సందర్భంగా కుటుంబానికి సంబంధించిన పూర్తి మరియు సరైన వివరాలను అందించాలని ప్రజలను కోరారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, అది కేవలం జనాభా లెక్కల కోసం మాత్రమే వినియోగించబడుతుందని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యాక ఎన్యుమరేషన్ ఐడి లభిస్తుందని, ఆ ఐడీ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని తెలిపారు. స్వీయ జనగణనకు ఒక్కరోజే గడువు మిగిలి ఉన్నందున, హన్మకొండ జిల్లా ప్రజలందరూ బాధ్యతగా పాల్గొని ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు.

# బైకును ఢీకొట్టిన మృత్యు లారీ

- -అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన దంపతులు
- -కేశవపూర్ గ్రామంలో విషాదం



అక్షరదర్బార్, హసన్ పర్తి: హన్మకొండ జిల్లా హసన్ పర్తి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. అతివేగంగా వచ్చిన లారీ బైకును బలంగా ఢీకొట్టడంతో దంపతులిద్దరూ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఎల్కతుర్తి మండలం కేశవపూర్ గ్రామానికి చెందిన చల్ల బతుకయ్య, ఆయన భార్య లక్ష్మీ పనుల నిమిత్తం బైకుపై వెళ్తుండగా హసన్ పర్తి సమీపంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. వీరి బైకును వెనుక నుండి వచ్చిన ఒక లారీ వేగంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో దంపతులిద్దరూ తీవ్ర గాయాలపాలై రోడ్డుపైనే ప్రాణాలు విడిచారు.

సమాచారం అందుకున్న హసన్ పర్తి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ వార్త తెలియగానే కేశవపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ గ్రామానికి చెందిన దంపతులు ఇలా అకస్మాత్తుగా మరణించడంతో బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు.

# కొనుగోలు కేంద్రాలు పెంచాలని బీఆర్ఎస్ ధర్నా

- రైతులకు ధైర్యం చెప్పని దౌర్భాగ్యపు స్థితిలో ఎమ్మెల్యే దొంతి: ఆకుల శ్రీనివాస్



అక్షర దర్బార్, నర్సంపేట: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మక్కల కొనుగోళ్లు నిలిచిపోయి, అకాల వర్షానికి పంట తడిసి రైతులు కుమిలిపోతున్నారని వరంగల్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మక్కల కొనుగోళ్లను వేగవంతం చేయాలని, అదనంగా ఐదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గిర్నిబావి వద్ద వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తన కాంట్రాక్టు పనుల మీద ఉన్న సోయి రైతులపై లేదని విమర్శించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామైంది.




## నైన్‌పాకలో బాల్ బ్యాడ్మింటన్ ఉచిత శిక్షణ

- వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- గూట్ల తిరుపతి

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలం నైన్‌పాక గ్రామంలో విద్యార్థుల కోసం బాల్ బ్యాడ్మింటన్ ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సమ్మర్ క్యాంపులో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడలపై మెలకువలు, వ్యాయామం నేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. శిక్షణ పొందగోరు విద్యార్థులు కోచ్ మోహన్‌ను 9666339997 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## మోదీ సభను జయప్రదం చేయండి: రాకేష్ రెడ్డి

అక్షర దర్బార్, శాయంపేట: ఈ నెల 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు శాయంపేట మండలం నుండి బీజేపీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని మండల సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో జరుగుతున్న దేశాభివృద్ధిని చాటిచెప్పేలా ఈ సభ ఉండబోతుందని, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.



## పలు వివాహ వేడుకల్లో నూతన జంటలకు పెద్ది ఆశీర్వాదం

అక్షర దర్బార్, దుగ్గొండి: నర్సంపేట నియోజకవర్గంలోని దుగ్గొండి మండలంలో శుక్రవారం జరిగిన పలు వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. చలపర్తిలో బిఆర్ఎస్ నాయకులు నల్ల కమలాకర్ రెడ్డి కుమార్తె ప్రమోదిక రెడ్డి – అజయ్ రెడ్డి వివాహంతో పాటు, మల్లేశ్, శ్రీనివాస్, తోటకూరి శ్రీనివాస్ మరియు రేఖంపల్లి మాజీ సర్పంచ్ మంద శ్రీనివాస్ కుటుంబాల్లో జరిగిన వివాహాలకు ఆయన హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, తక్కల్లపల్లి రవీందర్ రావు, శానబోయిన రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మక్క రైతులను దోచుకుంటున్న జిన్నింగ్ మిల్లుపై చర్యలు తీసుకోవాలి

- యజమానిపై క్రిమినల్ కేసు పెట్టి లైసెన్స్ రద్దు చేయాలి: మారపల్లి మల్లేష్

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలంలోని ఆంజనేయ కాటన్ మిల్లు యజమాని మొక్కజొన్న రైతులను నిలువు దోపిడీ చేస్తున్నాడని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తరుగు పేరుతో క్వింటాలుకు భారీగా కోత విధిస్తూ, హమాలీ ఖర్చుల పేరిట దోచుకుంటున్నారని మండిపడ్డారు. వారం రోజులైనా వాహనాలను అన్–లోడ్ చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కొనుగోలు లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐకెపి కేంద్రాల్లోనూ కనీస సౌకర్యాలు లేవని, అక్రమ దందాను అరికట్టాలని అధికారులను కోరారు.



## ఘనంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి పెళ్లి రోజు వేడుకలు

అక్షర దర్బార్, ములుగు: ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు–శ్రీలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు మల్లంపల్లిలో ఘనంగా జరిగాయి. భూక్య జంపన్న ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. లక్ష్మణ్ బాబు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాలేపు శ్రీనివాస్, చీదర సంతోష్, మాచర్ల ప్రభాకర్, నారోజు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



## కేఎంటీపీని సందర్శించిన కేంద్ర కార్యదర్శి

- అభివృద్ధి పనుల పురోగతి పరిశీలన
- నేడు పీఎం మిత్రను ప్రారంభించనున్న ప్రధాని

అక్షరదర్బార్, గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో అభివృద్ధి చెందుతున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం మిత్ర పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన తెలంగాణ రాష్ట్ర పర్యటనలో ఆదివారం హైదరాబాద్ నుంచి వర్చువల్ గా ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించేందుకు భారత ప్రభుత్వ టెక్స్ టైల్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి నీలం శామిరావు శనివారం వరంగల్ జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా వారిని హరిత కాకతీయ హోటల్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి పూల మొక్కను అందజేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం టీఎస్ఐఐసీ ఎండీ శశాంక్ తో కలిసి జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ లో అభివృద్ధి పనుల పురోగతి, వర్చువల్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పన, పార్క్ ద్వారా కలిగే ఉపాధి అవకాశాలు, స్థానిక అభివృద్ధిపై అధికారులు విస్తృతంగా చర్చించారు. ఈ పథకం ద్వారా వరంగల్ జిల్లా జాతీయ స్థాయిలో టెక్స్‌టైల్ రంగంలో ఒక కీలక కేంద్రంగా ఎదగనున్నదని, దీని వల్ల ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి తోడు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెగా టెక్స్ టైల్ పార్క్ జోనల్ మేనేజర్ స్వామి వరంగల్ ఆర్డీఓ సుమ, సంగెం, గీసుకొండ తాసిల్దార్లు రియాజుద్దీన్, రాజ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీలో నూతనోత్తేజం

- ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి బాధ్యతలు చేపట్టాక తొలిసారి నేడు తెలంగాణకు
- పశ్చిమబెంగాల్ విజయంతో నెక్స్ట్ టార్గెట్ తెలంగాణే అంటున్న కమలదళం
- ప్రధాని పర్యటనే లక్ష్యంగా.. ఎన్నికల శంఖారావం పూరించేందుకు రెడీ
- రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు మోడీ పర్యటనే 'బూస్టర్ డోస్'
- పరేడ్ గ్రౌండ్స్ సాక్షిగా బలప్రదర్శన.. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలే అస్త్రాలుగా వ్యూహం
- వరంగల్ కేఎంటీపీలో పీఎం మిత్రను ప్రారంభించనున్న మోడీ



అక్షరదర్బార్, హైదరాబాద్ : భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం తెలంగాణలో పర్యటిస్తుండటంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. కేంద్రంలో వరుసగా మూడవసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోడీ రాష్ట్రానికి తొలిసారి వస్తుండటం, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించనుండటంతో బీజేపీ నేతలు దీనిని ఒక కీలక రాజకీయ మలుపుగా భావిస్తున్నారు. త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు మోడీ పర్యటనను ఒక 'లాంచ్ ప్యాడ్'గా వాడుకోవాలని బీజేపీ కేంద్ర నాయకత్వం రాష్ట్ర విభాగానికి దిశా నిర్దేశం చేసింది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలోని డివిజన్లపై దృష్టి సారించి, భారీ ఎత్తున మహిళలు, యువతను సమీకరించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. జీడబ్ల్యూఎంసీలో ప్రస్తుతం ఉన్న 66 డివిజన్లు పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ఇక్కడ కూడా సత్తా చాటే దిశగా అడుగులు వేస్తున్నారు.

### ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు

కొద్దిరోజుల క్రితం ఐదు రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల ఫలితాలు బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపాయి. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రంలో ఘన విజయం సాధించి బీజేపీ తొలిసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. శనివారం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమానికి హాజరైన ప్రధానమంత్రి మోడీ తెల్లవారి ఆదివారం తెలంగాణ పర్యటనకు వస్తున్నారు. పశ్చిమ బెంగాల్ విజయంతో ఇక నెక్స్ట్ టార్గెట్ 2028 తెలంగాణే అని కమలనాథులు చెపుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్ష బీఆర్ఎస్ రెండూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని, తామే ఏకైక ప్రత్యామ్నాయమని చాటిచెప్పేందుకు ప్రధాని పర్యటనను బీజేపీ ఒక అవకాశంగా భావిస్తోంది. "కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఇప్పటికే రూ.10 లక్షల కోట్లు కేటాయించిందని, తాజాగా మరో రూ. 9,400 కోట్ల ప్రాజెక్టులతో మోడీ వస్తున్నారని" బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పేర్కొన్నారు. వరంగల్ మిత్ర పార్క్, కాజీపేట రైల్వే లైన్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిపై కేంద్రానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తాయని వారు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

### శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా భారీ ఏర్పాట్లు

పరేడ్ గ్రౌండ్స్‌లో సుమారు 2 లక్షల మందితో నిర్వహించనున్న ఈ సభను విజయవంతం చేసేందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా బైక్ ర్యాలీలు, గోడ పత్రికల ఆవిష్కరణలు చేపట్టారు. ప్రధాని రాకతో రాష్ట్ర బీజేపీ కేడర్‌లో నెలకొన్న స్తబ్ధత తొలగిపోయి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు గుర్రం ఎక్కడం ఖాయమని కమలనాథులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అటు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం, ఇటు రాజకీయ బహిరంగ సభ.. ఈ రెండు అంశాలతో కూడిన మోడీ పర్యటన తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

## పంటలు కొనకుండా పండుగలేలా?

- బొట్ల చక్రపాణి
- 11న కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా



అక్షర దర్బార్, పరకాల: రైతులు పండించిన మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం రైతు వారోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొట్ల చక్రపాణి విమర్శించారు. అకాల వర్షాలతో రైతులు కళ్లాల వద్దే పడిగాపులు కాస్తున్నా పాలకులకు పట్టడం లేదని మండిపడ్డారు. తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించి, లారీలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న హన్మకొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## చెరువులో విషం కలిపి చేపల వేట

- మత్స్యకారుల ఆవేదన



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలం చైన్‌పాక గ్రామ శివారులోని పెద్దమ్మకుంటలో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేసి లక్షలాది రూపాయల విలువైన చేపలను చంపేశారు. పంట చేతికొచ్చే సమయంలో అక్రమార్కులు పురుగుల మందు కలపడంతో చిన్న, పెద్ద చేపలన్నీ మృతి చెందాయని మత్స్యకారులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు.. తమకు జరిగిన ఆర్థిక నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, శాయంపేట: మండలంలోని నేరేడుపల్లి, ప్రగతి సింగారం, కాట్రపల్లి గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. సన్న ధాన్యానికి క్వింటాకు రూ. 2389 మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకమైన కొనుగోళ్లు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.




## అక్రమ కలప ట్రాక్టర్ పట్టివేత

- అటవీ శాఖకు అప్పగింత
- పర్యావరణ ప్రేమికుల చొరవపై అధికారుల ప్రశంస



అక్షర దర్బార్, శాయంపేట: నీరుకుల్ల నుండి పరకాలకు అక్రమంగా తరలిస్తున్న వేప కలప ట్రాక్టర్‌ను శాయంపేట మండలం పత్తిపాక వద్ద పర్యావరణ ప్రేమికులు పట్టుకున్నారు. వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యుడు మారపెల్లి సునీల్, నాగరాజు ట్రాక్టర్‌ను అడ్డుకుని అటవీ అధికారులకు సమాచారం అందించారు. డిప్యూటీ రేంజర్ కోటేశ్వర్ రావు ఘటనా స్థలానికి చేరుకుని కలపను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకున్న సునీల్, నాగరాజులను అధికారులు అభినందించారు.

## సూర్య నాయక్ తండాలో వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలంలోని సూర్య నాయక్ తండాలో హనుమాన్ శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో జరిగింది. జై శ్రీరామ్ నినాదాలతో తండా పురవీధులు మారుమోగాయి. యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక భజనలు నిర్వహించారు. హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, గ్రామం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి రాజు, భాషా, భాస్కర్, రమేష్ తదితర భక్తులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క

అక్షర దర్బార్, ములుగు: ములుగు మండలం రాయినిగూడెం గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) హాజరయ్యారు. మంకిడి సమ్మయ్య కుమారుడు లక్ష్మీప్రసాద్ – శ్రీవాణిల నూతన జంటను ఆమె ఆశీర్వదించారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం తనకు సంతోషాన్నిస్తుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, పల్లె జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'స్వీయ గణన' మారథాన్ రన్

- జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ ప్రారంభం
- నేటితో ముగియనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ గడువు

అక్షర దర్బార్, మహబూబాబాద్: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు జనగణనపై అవగాహన కల్పిస్తూ ఆదివారం మహబూబాబాద్ పట్టణంలో 'స్వీయ గణన మారథాన్ రన్' నిర్వహించారు. రైల్వే స్టేషన్ సెంటర్ నుండి బస్టాండ్ వరకు సాగిన ఈ ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ మరియు అదనపు జనగణన అధికారి కె. అనిల్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి కీలకమైన జనగణనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 26న ప్రారంభమైన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) గడువు ఈరోజుతో (మే 10) ముగుస్తుందని తెలిపారు. రేపటి నుండి (మే 11 నుండి జూన్ 9 వరకు) జనగణన సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి గృహాల గణన చేపడతారని వివరించారు. ఎన్యూమరేటర్లు వచ్చినప్పుడు ప్రజలు తమ పూర్తి వివరాలను నమోదు చేయించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాసరావు, డీపీఓ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు, సెన్సస్ సిబ్బంది, సాంస్కృతిక సారధి కళాకారులు మరియు స్వయం సహాయక బృందాల సభ్యులు పాల్గొన్నారు.



# వేగవంతం చేయాలి

- ధాన్యం కొనుగోలుపై కలెక్టర్లతో వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- ఫార్మర్ రిజిస్ట్రీ వందశాతం పూర్తి కావాలని ఆదేశాలు




అక్షరదర్బార్, భూపాలపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాలు, విద్యా, డీఆర్డీఓ తదితర అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాల్లో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సీఎస్ అధికారులను ఆదేశించారు. ఐడిఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పౌర సరఫరాలు, విద్యా, డిఆర్డీఓ తదితర అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సెస్ పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణా సమావేశాలు నిర్వహించి సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, డీఈఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కర్లపల్లిలో ఘోర విషాదం

- లేగదూడను రక్షించబోయి తండ్రీకొడుకు మృతి



అక్షరదర్బార్, గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లి గ్రామంలో శనివారం అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. పశువుల లేగ దూడను ప్రాణాలతో కాపాడాలనుకున్న ఆ తండ్రీకొడుకుల ప్రయత్నం విఫలమవడమే కాకుండా, వారిద్దరి ప్రాణాలనే బలి తీసుకుంది. ఈ ఘటనతో గ్రామం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు రసుపుత్ రాజు, పవన్ తమ పశువులను పర్యవేక్షిస్తుండగా, ప్రమాదవశాత్తు ఒక లేగ దూడ సమీపంలోని బావిలో పడిపోయింది. ఆ మూగజీవాన్ని ఎలాగైనా కాపాడాలన్న ఉద్దేశంతో తండ్రి మొదట బావిలోకి దిగారు. అయితే ఆయనకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోతుండటం చూసి, తండ్రిని కాపాడేందుకు కొడుకు కూడా బావిలోకి దూకాడు. దురదృష్టవశాత్తు కొడుకుకు కూడా ఈత రాకపోవడంతో, బావిలో నీరు లోతుగా ఉండటంతో ఇద్దరూ నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కళ్ల ముందే ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

సమాచారం అందుకున్న గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం కోసం ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బావిలో ఊపిరి ఆడక పోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. మూగజీవం కోసం ప్రాణాలర్పించిన తండ్రీకొడుకుల మృతి కర్లపల్లి గ్రామ ప్రజలను తీవ్ర విషాదం నింపింది.

# సాగు నీటి కాలువలకు 'పూడిక' గండం

- నీటి ప్రవాహానికి అడ్డంగా పిచ్చి మొక్కలు, ఇసుకమేటలు
- చివరి ఆయకట్టుకు అందని వైనం..
- అధికారులే పట్టించుకోవాలి



అక్షరదర్బార్, శాయంపేట: శాయంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో సాగునీరు అందించే ఎస్సారెస్పీ ఉప కాలువలు అధ్వాన స్థితికి చేరాయి. కాలువల్లో భారీగా పేరుకుపోయిన మట్టి, ఇసుక మేటలు, బండరాళ్లు మరియు పిచ్చి చెట్ల కారణంగా నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో కాలువ పొడవునా నీరు సాఫీగా సాగక, చివరి భూములకు చుక్క నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కురిసిన వర్షాలకు వాగుల నుండి వచ్చిన వరదతో కాలువలు పూడిపోయాయని, ముళ్ల పొదలు పెరిగి కాలువలు ఆనవాళ్లు కోల్పోతున్నాయని రైతులు వాపోతున్నారు. వానాకాలం పంటల సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో, సాగునీటి అవసరాల దృష్ట్యా తక్షణమే పూడికతీత పనులు చేపట్టాలని కోరుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన కాలువలకు మరమ్మతులు చేయించి, నీరు సజావుగా అందేలా చూడాలని వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులకు రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది.